# శారద లేఖలు

సౌ భా గ్య వ తి య గు క ల్ప ల త కు:—

నెచ్చెలీ!

అవును నేనుగూడ నదియే విషయమై యోచించుచున్నాను. విచారించిచూడ ఈపెండ్లిండ్లరద్దుచట్టము నామోదించుటలో నామోదింపకుండుటలోగూడ యిబ్బందులే కనుపడుచున్నవి. ఇది శారదాచట్టమువలె సులభముగా నామోదింప దగినదికాదు. దీని నామోదించితిమా భారతమహిళల నిరుపమానశీలముచే సముపార్జితమైన జగద్వందిత కీర్తికి కళంక మొదవెడు పరిస్థితు లేర్పడవచ్చును. మఱియు అవమానము, క్లేశము, చింత, మున్నగు కష్టములకు స్త్రీ గుఱికావలసివచ్చును. కాదంటిమా? నిర్హేతుకముగా భర్తృపరిత్యాగినులైన స్త్రీల దుర్గతికి తరణోపాయము దోచకున్నది. కాన ఈ విడాకులచట్ట మొకవంక స్త్రీలకు ఆత్మహత్యాకరముగను నొకవంక ప్రాణదానకరముగను కనుపించు చున్నది. దీని నింకను నిదానించి విచారించ నగును.

ఒక రొక మంచి పనిని చేయుచున్నచో వారితో సరిదూగుటకు మనము యత్నించుట తప్పుగాదు. కాని చెడుగునకు గూడ పోటీబడుట యుక్తమనిపించుకొనునా? పురుషులు భార్యను పరిత్యజించుటయనుచితకృత్యమని మనమిప్పుడు భావించుచున్నాము. భావనమేగాదు. అందులకు వారిని కఠినముగా నిందించుచున్నాము. వారినట్లు మనము దూషించుచు మనముగూడ నదియేపని కవకాశమును గోరుట సమంజసమగునా?

కల్పలతా! దాంపత్యముయొక్క పరమార్థము మహోత్కృష్టమైనది. దానియొక్క లక్ష్యము కేవలము భోగలాలసతగాదు. కాన దాంపత్యధర్మమును కేవలము భౌతికదృష్టితోజూచి విషయతృప్తియే పరమావధిగానెంచి పెండ్లిపై పెండ్లిగోరుట ప్రశస్తమగు యోచనకాదు.

ఒక పార్శ్వమునకు వ్యాధిసోకినచో దానిని నివారించుటకు రెండవమార్గమునకు గూడ నా వ్యాధిని ప్రాకించుట వ్యాధి నివారణకు మార్గముగాదు. ఒకవంక పురుషు డొనరించుచున్న దారాపరిత్యాగము అనుచితము నక్రమము సంఘవిచ్ఛిత్తికి కారణము పాపభూయిష్ఠమునై హిందూసంఘసౌష్ఠవమున కెనలేని యపకృతిగావించుచున్నది. నేడు స్త్రీలకుగూడ నట్టియవకాశ మొసగినచో నాలోపము నివారణమగునని భావింపరాదు. బహుశా యిబ్బందియగును.

మానవజన్మ మెప్పుడును లోపరహితముగాదు. ఎంతమంచివారియందును నేదియో యొక లోపముండితీరును. అట్టిచో నెంతయన్యోన్యానురాగముగల సతీపతులయందైనను నెప్పుడో యొకప్పు డేదియో యొకప్పు డభిప్రాయ భేదములు గలిగి తీరును. అంతమాత్రమునకే ఆడుది మగనిని, మగవాడు పెండ్లమును మార్చుకొనుచో నిక నా సంసారములో సారస్యమేమున్నది? ఒకవేళ వాదసౌకర్యార్థమై విడాకులు పుచ్చుకొందు రేయనుకొందము: అటులైనను వీరి కష్టము నివారణగాదు. ఏలనందువా మరల క్రొత్తగా కట్టుకొన్న ఆలుమగలలో మాత్రము పొరపొచ్చెములు పుట్టవని కంట్రాక్టేమున్నది? కాన కల్పలతా! ఇట్టి గంగాశంతనులసమయములతో దాంపత్యజీవనము నిర్విఘ్నముగా చెల్లదు. తమదాంపత్య జీవితమును సుఖమయముగాను, ఒడిదుడుకులు లేకుండునట్లును జరుపుకొనదలంచుచో స్త్రీపురుషు లిరువురు పరస్పరవిశ్వాసప్రేమలుగలిగి సౌహార్ద్రముతో నొకరిలోపముల నొకరు సైరణతో సవరించుకొని జీవితమును నడుపుకొనుటయే యుత్తమమార్గము. మఱియు విడాకులచట్టముచే మన సంఘము నెదుర్కొనబోవు మఱియొక కష్టముగూడ అపుడాలోచనీయము. మనదేశమున స్త్రీలకు సవతిబిడ్డల యెడగల యీర్ష్య సామాన్యమైనదిగాదు. ఇందువలన బాలబాలికలు పడుచున్న యిడుమలును సామాన్యమైనవిగావు. సవతిబిడ్డలను చూచి సహింపలేక స్త్రీలు కొందఱు విషప్రయోగాదిదుష్కృత్యములకు గూడ వెనుదీయకుండుట మన మనేకసమయములలో వినుచున్నాము. నేఁడు విడాకుల చట్టము నామోదించినచో బిడ్డలకు సవతితండ్రులుగూడ వచ్చెదరు. ఒక పురుషుని యదుపాజ్ఞలకులోబడియున్న స్త్రీయొక్క మాత్సర్యమే సవతిబిడ్డలయెడ నధికతరమైయుండగా స్వతంత్రుఁడగు మగవాడు సవతిసంతానము నెడల నింతకంటె నీర్ష్యాళువగుటకు నవకాశము గలదుగదా. కావున విడాకులచట్టముచే బిడ్డల సుఖస్థితి కష్టభూయిష్ఠమగును. మఱి ఆలుమగల సంసారమో నూతి ఒడ్డు బిడ్డ చందమున నెప్పటికప్పుడు ప్రమాదకరమై యుండును. ఇక నట్టి సంసారములో స్థాయియెక్కడ? సుఖమేది? ప్రేమ కవకాశ మెచ్చట? అన్నియు వ్యర్థము. గట్టిగ మాట్లాడిన భార్య లేచిపోవునేమో ననెడిభయము మగవానికిని మగడు లేచిపోవునేమో ననెడి భయమాడుదానికిని కలుగుచుండ నిట్టి పిఱికితనపు కాపురమెన్నాళ్లుసాగును. ఇట్టి దంపతులు యేమాత్రపు సౌఖ్యమనుభవింతురు. కాన విడాకులచట్టముచే హైందవ సంసారములకు విపరీతపరిస్థితి యేర్పడుట ఒకవిధముగా యోచింప నిక్కువమనేతలంపు గలుగుచున్నది. కాని మిత్రమా! నేనిట్లువ్రాయుటచేత తన కత్తి కెదురుకత్తిలేక భార్యయెడ నిరంకుశముగను నిర్దాక్షిణ్యముగను ప్రవర్తించెడి పురుషుల చెయిదములను నేను గుర్తింపలేదనిగాని, సమర్థింపుచున్నాననిగాని భావింప

374

కుము. తోటకూరలోని పురుగువలె స్త్రీ బహునీచముగా పురుషులచే విసరివేయబడు చున్నదని నాకు తెలియకపోలేదు. ఇందువలన మన స్త్రీలలో పెక్కురు ఆజన్మ దుఃఖముతో కుమిలిపోవుచున్నారనియు నేనెఱుగుదును. ఈవిషయము ప్రస్తావించునపుడు మన బంధుమిత్రులలోని స్త్రీలలో భర్తచే పరిత్యజింపఁబడినవారి నిర్వికారాకృతి నా మనోవీధిని పొడకట్టుచున్నది. ఆ అభాగినులెట్టి యపరాధము చేసినవారునుకారు. వారి తలిదండ్రులు పుష్కలముగా ధన మీయజాలక పోవుటయో, వారు రూపవతులుకాక పోవుటయో, వారు విద్యాభిరతిగలవారగుటయో, వంధ్యలగుటయో, రోగగ్రస్తలగుటయో ఇవియే వారిని పరిత్యజించుటకు కారణములు. ఇందువారు గావించిన నేరమేమియు లేదు. అయినను వారు నిర్దాక్షిణ్యముగా భర్తలచే విశసాడబడి జీవచ్ఛవములవలె పుట్టినింట బడియున్నారు. నిజముగా నిట్టి క్రూరకర్మము తలంచినప్పుడు డైవోర్సుచట్టము నిప్పటి కిప్పుడు పుట్టిన బాగుండుననినంత మనస్సు భగ్గురుమనును. కాని మన ఆర్యసాంప్రదాయ ధర్మమునుబట్టియు, కుటుంబజీవితముయొక్క శాంతి నాశించియు, సంతానమునకు కలుగ బోయెడి యుపద్రవము నాలోచించియు నించుక వెనుక ముందులరయుట యవసరమగు చున్నది. కాన ప్రత్యేక పరిస్థితులలో అనగా బాలికగర్భాదానము కానట్టిదియు లేదా సంతానము లేనట్టిదియునై యుండి భర్త షండుడు, పిచ్చివాడు, కుష్ఠురోగి, దేశాంతరగతుడునైనచో నట్టి బాలికకు పునర్వివాహ మొనర్పనగును. ఇదియే యాజ్ఞవల్క్యస్మృతియందుదాహరితమైన ధర్మసూత్రము. ఇట్టి స్థితియందే స్త్రీకి పునర్వివాహార్హత నొసంగనగునని నాయభిప్రాయము. దీని కొప్పదేని జీవకళత్రునకు వివాహాధికారము శాసనరీత్యా నిషేధింపబడవలెను; కాని యెట్టి మినహాయింపులు లేక విడాకుల చట్టము నామోదించుట మాత్రము ఉచితమార్గము కాదు. నేనిట్లు వ్రాయుటచే విడాకులచట్టము వచ్చినంతమాత్రముననే దంపతులెల్లరు కుప్పలు తిప్పలుగా త్రెంపి ముడులు పెట్టుకొందురా, ఏమి నీ పిచ్చియూహయని నీవు నవ్వెదవేమో. కాదు. కాదు. అట్టి విషమస్థితి భారతదేశమున కింతలోరాదు. కాని త్రికరణములయందు వాక్క్రియల కంటె మనస్సునకే ప్రాధాన్య మెక్కువగదా. ఆమోదము మానసికకార్యము. ఇంతే మన సదసద్వివేకము వెల్లడికావలెను. నేడు భారతస్త్రీలు డైవోర్సుచట్టము నామోదించి నారనినచో ఆచరింపకపోయినను నామోదించినట్లే గదా? అందువలననే, భూతకాలమును పరిశీలించుము. భవిష్యము నాలోచించుము. వర్తమానము గుర్తింపుమని నిన్ను హెచ్చరించుట.

భావపురి
౧౫-౮-30

మిత్రురాలు
శారద